## క్లుప్తంగా

### ఎరువులు కొనలేకపోతున్నాం..

సీతంపేట: బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నామని మండ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సవర సాయికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 31 గ్రామ సచివాలయాలుండగా.. రెండు, మూడు సచివాలయాలను మినహాయిస్తే యూరియా, ఫాస్ఫేట్ వంటి ఎరువులు ఎక్కడా లేవన్నారు. ఇదే అదునుగా బయటి వ్యాపారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ట్రైబల్ వెల్ఫేర్ ఈఈగా రమాదేవి


రమాదేవి

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈగా పి.రమాదేవిని కొనసాగిస్తూ స్టేట్ చీఫ్ ఇంజినీర్ బి.వసంత ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఈఈగా నియమితులైన ఏడు నెలలుకే నిబంధనలకు విరుద్ధంగా ఆమెను నెల్లూరుకు రెండు నెలల కిందట బదిలీ చేశారు. ఆ స్థానంలో కేఎస్‌వీఎన్ కుమార్‌ను నియమించారు. ఈ వ్యవహారం అప్పట్లో వివాదాస్పదమైంది. దీంతో రమాదేవి హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం ఆమెను సీతంపేటలో యాథావిధిగా కొనసాగించాలని ఆదేశించింది. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఈ నెల 25న విధుల్లో చేరుతానని రమాదేవి తెలిపారు.

### చురుగ్గా జంగిల్ క్లియరెన్స్


కురుపాం పంచాయతీ పరిధిలో 11కేవీ లైన్ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు

కురుపాం: మండల కేంద్రంలో విద్యుత్ శాఖ డీఈఈ ఎం.రాజేంద్రప్రసాద్, ఏఈ వై.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ పనులు శుక్రవారం చేపట్టారు. ఈ పనుల కారణంగా మండల కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. 11 కేవీ విద్యుత్ లైన్ మీదుగా పేరుకు పోయిన చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించారు. ఇకపై విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

### అధ్వానంగా కరెంటుగూడ రహదారి


రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న కరెంటుగూడ రహదారి

కురుపాం: మండలంలోని పొడి పంచాయతీ కరెంటుగూడ, మీగడ గిరిజన గ్రామాల ప్రజలకు అధ్వాన రహదారితో అవస్థలు తప్పటం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో కొండను తవ్వినా మట్టి రోడ్డును నిర్మించినా అది ఎన్నాళ్లు లేదని తుఫాన్ కారణంగా మట్టి రోడ్డు మొత్తం వరద నీటికి కొట్టుకుపోయిందని గిరిజనులు తెలిపారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువులు, అత్యవసర వైద్యం కోసం వెళ్లాలంటే నరక యాతన తప్పటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు స్పందించి రహదారి వేయాలని కోరారు.

### ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

- డీఆర్‌డీఏ పీడీ సుధారాణి


చలివేంద్రిలో పంటలను పరిశీలిస్తున్న పీడీ సుధారాణి, తదితరులు

వీరఘట్టం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి సూచించారు. మండలంలోని చలివేంద్రి గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ఎస్ క్లస్టర్లలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అంతకుముందు స్థానిక వెలుగు కార్యాలయంలో బీపీఎం, గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఆమెతో పాటు ఏపీఎం కె.రాము, తదితరులున్నారు.

### వినాయక విగ్రహాలు సిద్ధం

భామిని: తొలిపూజ అందుకోవడానికి గణపయ్యలు సిద్ధమయ్యారు. వాడవాడలా వినాయక మంటపాలు ఏర్పాటు చేసేందుకు యువత సిద్ధమయ్యారు. ఇప్పటికే మంటపాల ఏర్పాటులో బిజీగా ఉన్నారు. ఇదిలా ఉంటే మండలంలోని గురండి, సింగిడి, భామిని, బాలేరు, ఘనసర కూడళ్లలో వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కొంతమంది ముందస్తు అడ్వాన్స్‌తో భారీ విగ్రహాలు తయారు చేసుకోగా.. మరికొందరు ఆ రోజునే కొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# మద్యంబాబుల జేబుకు చిల్లు..



- బడ్డీకొట్టుల్లో జోరుగా మద్యం విక్రయాలు
- అధిక ధర, నాసిరకం మందుతో దోచుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు


వీరఘట్టంలో ఓ బెల్ట్ షాపులో మద్యం సేవిస్తున్న వ్యక్తి

వీరఘట్టం:

మద్యంబాబుల వీక్‌నెస్‌ను ఆసరాగా చేసుకుని బెల్ట్‌షాపుల వ్యాపారులు దోచుకుంటున్నారు. మద్యం అలవాటు ఉన్నవారిలో చాలామందికి తెల్లవారికే మందు కావాల్సి ఉంటుంది. అయితే ఈ సమయంలో ప్రభుత్వ అనుమతులున్న మద్యం దుకాణాలు తెరుచుకోవు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మద్యంబాబులు బెల్ట్‌షాపులను ఆశ్రయిస్తుంటారు. ఇక్కడే అసలు దందా మొదలవుతోంది. అసలు ధర కంటే 50 రూపాయలు ఎక్కువగా వసూలు చేయడంతో పాటు నాసిరకం మందు ఇచ్చి వారి జేబులకు చిల్లు పెడుతున్నారు. ఎప్పుడైనా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు దాడులు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. వెంటనే బెయిల్ వచ్చేస్తుండడంతో బెల్ట్ దుకాణదారులు రెచ్చిపోయి మరీ విక్రయాలు చేపడుతున్నారు. వీరికి వెనుకనుంచి మద్యం దుకాణాల యజమానులు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 451 పంచాయతీలు, 3 నగర పంచాయతీల్లో 56 ప్రభుత్వ అనుమతులున్న మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు 10 బార్లు ఉన్నాయి. ఆయా దుకాణాల పరిధిలో సుమారు 1500 వరకు బెల్ట్ దుకాణాలున్నట్లు సమాచారం. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపడుతున్నా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందంటే తనిఖీలు ఎలా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా కల్తీ మద్యంతో పాటు ధర పెంచుతూ మందుబాబులను నిలువునా దోచుకుంటున్నారు. వీరఘట్టం, పాలకొండ, పార్వతీపురం, సాలూరు తదితర పట్టణాల్లో చాలా బడ్డీ కొట్టులు నేడు బుడ్డీ కొట్టులుగా మారాయి.

**లీకవుతున్న ముందస్తు సమాచారం..**

జిల్లాల నుంచి ఎక్సైజ్ ఉన్నతాధికారులు వస్తున్న సమాచారం ముందుగానే బెల్ట్‌షాపుల యజమానులకు తెలిసిపోతోంది. దీంతో వారు వచ్చి తనిఖీలు చేపడుతున్నా పెద్దగా ఫలితం ఉండడం లేదు. ఇంటి దొంగలే సమాచారాన్ని లీక్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**కఠిన చర్యలు..**

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం దుకాణాల్లో ఏ ఒక్కరికైనా రెండు లేదా మూడు బాటిళ్ల కంటే ఎక్కువ విక్రయించరాదు. మద్యంషాపుల నుంచి బెల్ట్ దుకాణాలకు మద్యం తరలించినట్లు రుజువైతే ఆ షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

– శ్రీనాథుడు, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి, పార్వతీపురం మన్యం

## భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం


చిలకాంలో భగవద్గీత పారాయణం చేస్తున్న బృందం

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతీదేవీ విగ్రహం వద్ద శుక్రవారం భక్తి శ్రద్ధలతో భగవద్గీత పారాయణం చేశారు. స్వామిసేవా సమితి కార్యదర్శి కంచుమోజు రామోహన్‌రావు పర్యవేక్షణలో సరస్వతీదేవీ విగ్రహం ఏర్పాటుచేసి రెండవ ఏటలో అడుగుపెడుతున్న తరుణంలో నవ కుండీల గాయిత్రీ సహిత సరస్వతీ పూజను నిర్వహించారు. అనంతరం భక్త బృందంచే భగవద్గీత పారాయణం చేశారు. పూజా కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ద్వారపురెడ్డి సత్యన్నారాయణ దంపతులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొన్నారు.

## సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి


మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: వచ్చే నెల 13,14 తేదీలలో పాలకొండ పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల సంఘ కోశాధికారి అమరవేణి, ఆశా వర్కర్ల సంఘ అధ్యక్షురాలు గౌరీశ్వరి, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## నేడు గుండె సంబంధిత సమస్యలకు ఉచిత వైద్య శిబిరం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురంటౌన్: పిల్లలో పుట్టుక, ఎదుగుదల లోపాలు సకాలంలో గుర్తించి, చికిత్స అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎమ్‌- ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో భాగంగా పార్వతీపురం జిల్లా ఆస్పత్రి దరిలో ఉన్న డీఈఐసీ కేంద్రంలో పుట్టుక నుంచి 18 ఏళ్ల వరకు ఉన్న బాలలకు సీహెచ్‌డీ, గుండె సంబంధిత సమస్యలకు విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి నుంచి పిల్లల కార్డియాలజిస్ట్ డా. అశోక్ రాజు వైద్య బందం వైద్యారోగ్యశాఖ సూచనల మేరకు శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారని గుండె సంబంధిత సమస్యలున్న పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న అంగన్వాడీ, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌లో ఆరోగ్య సమస్యలు, లోపాలు, వైకల్యాలు, వ్యాధులు పిల్లల్లో సత్వరమే గుర్తించి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా డీఈఐసీ కేంద్రానికి చేర్చాలన్నారు. కార్యక్రమంలో డీఈఐసీ పిల్లల వైద్య నిపుణుడు డా.ఎల్. భరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులపై ఎందుకంత కక్ష


పొట్నూరు లక్ష్మణరావు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వానికి దివ్యాంగులపై ఎందుకంత కక్షో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని తెట్టంగిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్హత ఉన్న వారి పింఛన్లు సైతం తొలగిస్తుంటే అధికారులు ఎందుకంత పక్షపాతంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల మంది పింఛన్లు తొలగించారని వాపోయారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా.. ఉన్న పింఛన్లు తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. బాధిత లబ్ధిదారులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

## నియామకం..


డాక్టర్ పొన్నాడ భార్గవ్

భామిని: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రెండో వైద్యుడిగా పొన్నాడ భార్గవ్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఇంతవరకు పని చేసిన డాక్టర్ సోయల్ పసుపులేటికి విజయనగరం జిల్లా చల్లపేట పీహెచ్‌సీకి బదిలీ జరిగింది. ఇప్పటికే భామిని వైద్యాధికారిగా సంతోషిలక్ష్మి కొనసాగుతున్నారు.

## మాంసం దుకాణాల తనిఖీ

సాలూరు: పట్టణంలోని మాంసం దుకాణాల ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. మాంసాలపై జాలీలు వేయని, నిబంధనలు పాటించని పలు దుకాణాలను గుర్తించి అక్కడ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, నాణ్యమైన మాంసం విక్రయించాలని, దుకాణాల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్న నిబంధనలను వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

- జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలు
- ప్రధాన రహదారిలోనే భారీ వాహనాల రాకపోకలు
- జఠిలమవుతున్న సమస్య
- ప్రత్యామ్నాయ రోడ్లతోనే సమస్యకు పరిష్కారం


జిల్లా కేంద్రంలో ట్రాఫిక్, (ఇన్‌సెట్లో) పార్కింగ్ లేక పోవడంతో ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేసిన వాహనాలు



పార్వతీపురంటౌన్:

జిల్లాకేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటు చేయడమే శరణ్యంగా కనిపిస్తోంది. పట్టణంలో ఎక్కడికి వెళ్లాలన్నా ప్రధానంగా రాకపోకలు చేసేది మెయిన్ రోడ్డు పైనుంచే. ఆ రోడ్డు ఉదయం, సాయంత్రం చాలా రద్దీగా ఉంటుంది. వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పట్టణ పరిసర ప్రాంతాల పరిధిలో ఉన్న వారు పనులపై వచ్చే వారి వాహనాలతో పాటు స్కూళ్లు, కళాశాలలు, ఆర్టీసీ బస్సుల తాకిడి కూడా ఎక్కువే. పట్టణంలో నిత్యం సుమారు 10వేల మంది విద్య, వైద్య, వ్యాపార, ప్రభుత్వ కార్యకలాపాల అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణ ప్రధాన రహదారి, బైపాస్ రోడ్డు మీదుగా ఒడిశా రాష్ట్రం రాయగడ, అలమండ, కొరాపుట్ జిల్లాలకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఒక్కటే కావడం వల్ల ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బైపాస్ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆ పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రహదారిపై దృష్టిసారించని ఫలితంగా పట్టణ ప్రజలు, జిల్లా కేంద్రానికి వచ్చేవారు, ఒడిశా రాష్ట్రానికి ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

**ప్రత్యామ్నాయం ఇదే..**

- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పలు ప్రాంతాలను కలిపి నూతన రహదారి నిర్మాణం చేయడం.
- పట్టణ శివారులో గల వెంకంపేట మీదుగా కొమరాడ మండలం శివిని గ్రామం వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రణాళికలు రూపొందించిన బైపాస్ రహదారి నిర్మాణం చేపట్టాలి.
- పట్టణ ప్రధాన రహదారిపై షాపింగ్ మాల్‌లు, వ్యాపార సముదాయాల యజమానులు పార్కింగ్ స్థలం కేటాయించాలి.
- పట్టణ ప్రధాన రహదారిపై కాలువల ఆక్రమణను నియంత్రించాలి.
- స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యకలాపాల సమయాల్లో నో ఎంట్రీ విధించాలని స్థానికులు కోరుతున్నారు.

**ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే పార్కింగ్**

పట్టణానికి ప్రధాన రహదారి, ఒడిశా రాష్ట్రానికి వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి అదే కావడం, దానికి తోడు ప్రధాన రహదారిపైనే వ్యాపార సముదాయాలు, మార్కెట్‌లు, ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్ అన్నీ ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా షాపింగ్ మాల్‌లు, వ్యాపార సముదాయాల వద్ద సెల్లార్ పార్కింగ్ సదుపాయం లేకపోవడం వల్ల వ్యాపార సముదాయాల ముందు రోడ్డుపైన వాహనాలను పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పార్కింగ్‌కు వ్యాపార సముదాయాల యజమానులు స్థలం కేటాయించకపోవడంతో రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు తిరిగే సమయాల్లో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

## బాల్య వివాహాలు నిర్మూలించాలి


మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా నిర్మూలించే బాధ్యతను నిర్వర్తించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మదిరంలో శుక్రవారం ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఏఎన్‌ఎంలతో బాలల సంరక్షణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు జరగడం వల్ల ఆడ పిల్లలు అనారోగ్యం పాలవుతారన్నారు. అంతేకాకుండా చదువు మధ్యలో ఆగిపోవడం, కాన్పు కష్టం, ప్రసూతి మరణాలు, శిశు మరణాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, భద్రగిరి సీడీపీవో కె.విజయగౌరి, కౌన్సిలర్ పల్లవి రాజు తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

## దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి, జోగులు, తదితరులు

- వారి తరఫున కోర్టునాశ్రయిస్తాం
- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యేలు కళావతి, జోగులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు మండిపడ్డారు. పాలకొండలో శుక్రవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పింఛన్ల ఏరివేత చేపట్టిందని, ఇందులో భాగంగా అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉండి పింఛన్ తొలగిస్తే వారి తరఫున కోర్టుకు వెళ్లి పోరాడుతామని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో పింఛన్లు పోయిన వారి వివరాలతో సచివాలయాల్లో ఫిర్యాదు చేశామని వివరించారు. ఎన్నికల ముందు 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, ఇందుకు వత్తాసు పలికి పవన్ కల్యాణ్‌లు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు వెలమల మన్మథరావు, దమలపాటి వెంకటరమణనాయుడు, కడగల రమణ, దుప్పాడ పాపినాయుడు, కర్రి గోవిందరావు, పాలవలస ధవళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టుకార్డు ఉద్యమం


పోస్టుకార్డులు పోస్టు చేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

పాలకొండ రూరల్: పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను జిల్లా కేంద్రం చేయాలని, లేనిపక్షంలో పాత శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలని కోరుతు పాలకొండ జిల్లా సాధన సమితి పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా సాధన సమితి సభ్యులు ప్రభుత్వానికి ఉత్తరాలు పోస్టు చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు కనపాక చౌదరినాయుడు, వందాన కూర్మారావు, సబ్బ నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కాలనీ వాసులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధి గారమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. కొంతకాలంగా ఇక్కడి సమస్యలపై పలుమార్లు వినతిపత్రం అందించినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాలనీలో 33 వీధులన్నా కనీసం సీసీ రోడ్లు, కాలువలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కూడా లేవన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం కమిషనర్ రత్నంరాజుకు వినతిపత్రం అందజేశారు.

## వేతనదారులు ఉపాధి పనులు వినియోగించుకోవాలి

సీతానగరం: మండలంలో ఎన్‌ఆర్‌ఈజీ ఎస్ పథకం ద్వారా కల్పిస్తున్న పనులు వేతనదారులు వినియోగించు కోవాలని జెడ్పీ మాజీ సభ్యుడు అంబటి కృష్ణంనాయుడు, అన్నారు. ఉపాధిహామీ పథకం శ్రామికులకు గ్రామాల్లో కల్పిస్తున్న అవగాహన సదస్సు, గ్రామసభల్లో భాగంగా శుక్రవారం అంటిపేటలో సర్పంచ్ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు వై. భాస్కరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి అర్హులైన కుటుంబాల వారు పనులు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులు మెరుగ్గా ఉన్నాయని, సామాజిక పరమైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎస్ఆర్‌పీ దాసు మాట్లాడుతూ ఇన్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్(ఐఈసీ)టీం ద్వారా గ్రామాల్లో ఉండే శ్రామికులకు ఉపాధి హామీ పథకంలో హక్కులు, సౌకర్యాలు, రాజీలేని అంశాలపై, గ్రామానికి సంబంధించిన చిత్రపటాన్ని వేసి ప్రజలకు వివరించారు.